క్లుప్తంగా

మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి రాజశేఖర్

ఓబులవారిపల్లి : కోపం, ఆవేశం, ఆందోళన వంటి మానసిక సమస్యలను సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలని వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా వ్యాధిగ్రస్తులతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తక్కువ వయస్సు ఉన్న వారికి కూడా రక్తపోటు సమస్య వస్తుందని, ఆహారపు అలవాట్లు, జీవనశైలి ఇందుకు కారణమన్నారు. కావున సాధ్యమైనంత వరకు దినచర్యను మార్చుకోవాలని ఆయన సూచించారు. అనంతరం రక్తపోటు వలన కలిగే అనర్థాలు తదితర అంశాలు గురించి వివరించారు. కార్యక్రమంలో స్థానిక ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సత్యమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న సత్యమ్మ

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి జాతీయ రహదారి పక్కన వెలసివున్న శ్రీ సత్యమ్మ అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం సందర్భంగా వేకువజాము నుంచే అమ్మవారిని మహిళలు ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పూజలు నిర్వహించి కాయాకర్పూరం సమర్పించారు. ప్రతి శుక్రవారం అమ్మవారికి పూజలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తులు విశ్వాసం. దీంతో పెద్దఎత్తున మహిళలు అమ్మవారిని దర్శించుకొని ప్రదక్షిణలు చేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి

మదనపల్లె సిటీ : స్థానిక కదిరిరోడ్డులోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం సుప్రభాతసేవ, స్వామికి పంచామృతాభిషేకం, ఆరాధన మహోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం దీపారాధన, షోడశోపచార పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు లక్ష్మీనారాయణచారి, భాస్కరాచారి, అర్చకులు వీరబహ్మాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కడప కల్చరల్ : జిల్లాలోని పద్మశాలీయ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు కడప పద్మశాలీయ సేవా సంఘం అధ్యక్షులు అవ్వారు సుబ్బారాయుడు తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికిగాను పది, ఇంటర్, ఐటీఐ, ఇంజనీరింగ్, ఎంసెట్, మెడిసిన్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు తమ సంస్థ ప్రత్యేకంగా పురస్కారాలు అందజేస్తుందని తెలిపారు. పదవ తరగతిలో 500 మార్కులు, ఇంటర్మీడియేట్ బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో 900 మార్కులకుపైగా, ఆర్ట్స్ గ్రూపుల్లో 800 మార్కులకుపైగా సాధించిన విద్యార్థులతో పాటు ఐటీఐ, ఎంసెట్, ఇంజనీరింగ్, నీట్, మెడిసిన్‌లలో పట్టణ, జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన పద్మశాలీయ విద్యార్థులు ఈ పురస్కారాలకు అర్హులన్నారు. విద్యార్థులు తమ మార్కుల జాబితాతోపాటు టీసీ జిరాక్స్ కాపీ, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, ఫోన్ నెంబరు, బయోడేటాతోసహా పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 10వ తేదీలోగా పద్మశాలీ భవన్ కల్యాణ మండపం, 38/166–5, చిన్న చౌకు, తిరుపతిరోడ్డు, కడప–516002 చిరునామాకు పంపాలని సూచించారు. అర్హులైన ప్రతిభ గల విద్యార్థులకు జూన్ 16 ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 98490 26877 లేదా 957300822 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ శిలాఫలకం ధ్వంసం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పులికల్లులో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ శిలాఫలకాన్ని శుక్రవారం గుడ్డంపల్లికి చెందిన ఎస్‌వీఆర్ అలియాస్ రమణ అనే టీడీపీ కార్యకర్త ధ్వంసం చేశాడు. అయితే సదరు వ్యక్తి సైకోలా వ్యవహరించి శిలా ఫలకాన్ని ధ్వంసం చేశాడని పలువురు పేర్కొన్నారు. టీడీపీ నాయకులు తెర వెనుక కీలక పాత్ర పోషిస్తూ రమణను రెచ్చగొట్టి ఇలా చేయించారని మరి కొందరు అభిప్రాయం వ్యక్తం చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శాంతి భద్రతలను అదుపు చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసామని ఎస్‌ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు.

ఘనంగా ప్రారంభమైన మాతమ్మ జాతర



ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు



పోతులూరయ్యను ఊరేగిస్తున్న దృశ్యం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల కేంద్రమైన పెనగలూరు అరుంధతివాడలో శుక్రవారం మాతమ్మ జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. నూతనంగా నిర్మించిన ఆలయంలో మొదటిసారిగా జాతర మూడురోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతరకు కటౌట్లను కూడా ఏర్పాటు చేయడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శుక్రవారం సాయంత్రం పోతులూరయ్య, మాతమ్మ ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. మూడురోజులపాటు ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



నూతనంగా నిర్మించిన మాతమ్మ ఆలయం

నేడు కన్యకా పరమేశ్వరి జయంతి

నందలూరు(రాజంపేట) : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శనివారం అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఎంబలూరు నరసింహస్వామి, మాకం వెంకటకుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 6 గంటలకు మూలవిరాట్‌కు, ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం విందు భోజనం, సాయంత్రం కోలాటాల నడుమ అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. అనంతరం జయంతి సందర్భంగా భారీ ఎత్తున కేక్‌ను ఏర్పాటు చేసి వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యులు పెద్దఎత్తున పూజల్లో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

వాసవీ జయంతికి ఏర్పాట్లు పూర్తి

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేటలో వెలసిన శ్రీ వాసవీ కన్యాకాపరమేశ్వరి దేవి ఆలయంలో (అమ్మవారి) జయంతి ఉత్సవాలు శనివారం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆలయ సంప్రోక్షణ, స్వస్తి హవాచనం, మహాగణపతి పూజ, అమ్మవారికి శ్రీ చక్రానికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేక పూజలతోపాటు అలంకరణ జరుగుతుందన్నారు. అలాగే లలితా సహస్రనామ పారాయణం తదితర పూజలు ఉభయ దాతల, ఉభయులు, మహా మంగళహారతి, ప్రసాద వినియోగం కార్యక్రమాలు ఉంటాయన్నారు. రాత్రికి అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు.



రామాపురం: వాసవీ కన్యాకాపరమేశ్వరి మూలవిరాట్

వన్నెతగ్గనివి షేక్స్‌పియర్ రచనలు

కురబలకోట: ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు గడించిన ప్రముఖ నాటక కర్త షేక్స్‌పియర్ రచనలు ఎప్పటికీ వన్నెతగ్గనివని అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామనాథన్ అన్నారు. ఆంగ్ల భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో ఆంగ్ల, ఫారిన్ లాంగ్వేజెస్ విభాగంచే శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి ఆధునిక ప్రపంచంలో రాణించాలంటే ఆంగ్లం తప్పనిసరిగా మారిందన్నారు. షేక్స్‌పియర్, ఇంగ్లీషుకు ఎనలేని వన్నె తెచ్చారన్నారు. ఆయన రచనలు నిత్యనూతనమే కాకుండా సజీవమన్నారు. భావ సౌందర్యం, పదాల పొందిక, రచనా శైలి, పద్య ప్రక్రియ, మనిషి మనో భావాల ఆవిష్కరణ, అర్థవంతమైన భావనలు నేటి తరం వారికే కాకుండా భవిష్యత్ తరాలకు కూడా ఆదర్శనీయమన్నారు. కత్తి కంటే కలం గొప్పదన్న నానుడి రావడం వెనుక షేక్స్‌పియర్ స్ఫూర్తి, ప్రేరణ దాగి ఉందన్నారు. స్టాన్లీ హౌటన్ రచించిన ది డియర్ పార్టెడ్, ఎకామెడి ఇన్ వన్ యాక్ట్ నవల నాటకాన్ని విద్యార్థులు ఈ సందర్భంగా ప్రదర్శించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

మదనపల్లె : నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, టాలీ కోర్సుల్లో ఉచిత నైపుణ్యశిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు కోఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. ఉచిత శిక్షణకు పదోతరగతి పాస్, ఇంటర్మీడియట్, డిప్లమా, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన స్టూడెంట్స్ హాజరుకావచ్చన్నారు. 18 ఏళ్ల నుంచి 28 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. శిక్షణ కాలం 35 రోజులు ఉంటుందని, భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. ట్యాలీ ప్లస్, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్ కోర్సులపై ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు.. హరిప్రసాద్, 9000487423 నెంబర్‌పై సంప్రదించాలన్నారు. నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

అనారోగ్యంతో కలికిరి సర్పంచ్ మృతి

కలికిరి: మండలంలోని కలికిరి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆర్.ప్రతాప్‌కుమార్‌రెడ్డి(62) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఈ నెల 5 తేదీన తన స్వగృహంలో అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సర్పంచ్ శుక్రవారం చివరి శ్వాసవిడిచారు. శనివారం కలికిరి రెడ్డివారిపల్లిలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి ముత్యాలమ్మ తిరునాల

ములకలచెరువు : మండలంలోని బురకాయలకోటలో వెలసిన ముత్యాలమ్మ తిరునాల శనివారం నుంచి సోమవారం వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

సమస్యలు సృష్టించకండి

అట్లూరు : జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ ముగిసే వరకు ఎలాంటి సమస్యలు సృష్టించి సమస్యల్లో ఇరుక్కోకూడదని, ప్రతి ఒక్కరు శాంతియుతంగా నడుచుకోవాలని బద్వేలు రూరల్ సీఐ విక్రమసింహ, స్థానిక ఎస్‌ఐ కె.సి.రాజులు పేర్కొన్నారు. స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో శుక్రవారం మండల పరిధిలోని అన్ని పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈరోజు వివిధ పార్టీల నాయకులతో సమావేశం కావడం జరిగిందని, రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్ల దృష్ట్యా గుర్తెరిగి ప్రతిఒక్కరు ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకూడదని తెలిపారు.

బెండ.. చిన్నరైతులకు అండ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని పలు గ్రామాలలో చిన్న రైతులు బెండ పంట సాగు వల్ల ప్రతి రోజూ ఆదాయం వస్తూ ఉండడంతో పలువురు రైతులు బెండను సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. చిన్నకారు రైతులకు తక్కువ పొలంలో వ్యయం తక్కువగా బెండ పంట లాభసాటిగా మారింది. ముఖ్యంగా కేసీ అగ్రహారం, శెట్టిగుంట, రెడ్డివారిపల్లి, రాఘవరాజపురం, బొజ్జవారిపల్లి తదితర గ్రామాలలో రైతులు ఉన్న కొంత భూమిలో బెండ సాగు చేస్తున్నారు. అలాగే పలువురు అరటిలో అంతర్‌పంటగా పండిస్తున్నారు. రెండు నెలల్లో వచ్చే ఈ పంటకు తెగుళ్లు , కలుపు రాకుండా జాగ్రత్తలు తీసుకొంటే ప్రతి రోజూ కోతకు వస్తుంది. ప్రస్తుతం రైతులు బెండను మార్కెట్‌కు కేజీ రూ.20 రూపాయల నుంచి 30 రూపాయల వరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకొంటున్నారు. మంచి దర పలుకుతుండంతో రైతులకు మంచి ఫలితాలు వస్తున్నాయి. ఇంకా చీడపీడల నుంచి పంటను కాపాడుకోగలిగితే బెండసాగు లాభసాటిగా ఉంటుంది.



రాఘవరాజుపురంలో సాగు చేస్తున్న బెండ

భద్రకాళికి రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి



రాహుకాల పూజలు చేస్తున్న మహిళలు

రాయచోటి టౌన్ : పట్టణంలోని శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో వెలసిన భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆలయ పాలకమండలి చైర్మన్ పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలాగే పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, భక్తులు నిమ్మకాయలతో తయారు చేసిన హారాన్ని అలంకరించారు. భక్తులు నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. అమ్మవారికి దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా ధ్వజారోహణం

మదనపల్లె సిటీ: శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి వార్షిక బ్రహోత్సవాలు శుక్రవారం ఆగమోక్తంగా ఆరంభమయ్యాయి. ఉదయం ధ్వజారోహణంతో స్వామి వారి బ్రహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ గరుడ చిత్రంతో కూడిన ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్టించారు. అనంతరం శ్రీవారి ఆస్థానాన్ని ఘనంగా చేపట్టారు. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణస్వామి వారి సమక్షంలో మిథున లగ్నమందు ధ్వజారోహణం నిర్వహించారు. 18 గణాలను, ముక్కోటి దేవతలను బ్రహోత్సవాలకు ఆహ్వానించడం ధ్వజారోహణం ఉద్దేశం. తర్వాత శ్రీదేవి,భూదేవి సమేత వెంకటరమణస్వామి ఉత్సవర్లకు వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు.

సూర్య,చంద్ర వాహనాలపై వెంకన్న..

బ్రహోత్సవాల్లో భాగంగా ఉదయం రెడ్డప్పనాయుడు కాలనీ, బ్యాంకు కాలనీ,గొల్లపల్లి భక్తాదులు ఉభయదారులుగా వ్యవహరించారు.ప్రత్యేక వాహనంలో స్వామి సూర్యప్రభవాహనంపై రెడ్డప్పనాయుడు కాలనీలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ నాయకులు ద్వారకనాథరెడ్డి, కంభం నాగభూషణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం ఈశ్వరమ్మకాలనీ ఉభయదారులుగా స్వామి చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు తదితరులు పాల్గొన్నారు.

23న దేవుని మాన్యం కౌలుకు వేలం

గోపవరం : రాచాయపేట గ్రామంలో వెలసి ఉన్న శ్రీసోమేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి హక్కుభుక్తం కలిగిన భూములను ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు రాచాయపేటలో కౌలుకు వేలంపాట నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ బద్వేలు ఈవో సి.శివయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు ముందుగా వెయ్యి రూపాయలు డిపాజిట్ రూపంలో చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. పాట ముగిసిన వెంటనే హెచ్చు పాటదారుడు ఒక సంవత్సరానికి సంబంధించిన కౌలుగుత్త చెల్లించాలన్నారు. అలా చెల్లించని యెడల ఆ భూములను తిరిగి వేలం వేయనున్నట్లు తెలిపారు. గతంలో భూములు కౌలుకు తీసుకున్న వారు పాత బకాయిలు ఉన్నట్లయితే అలాంటి వారు పాటలో పాల్గొనకూడదన్నారు. రాచాయపేటలోని సర్వే నంబర్ 360లో 2.79 ఎకరాలు, బెడుసుపల్లెలో సర్వేనంబర్ 108లో 0.81 సెంట్లు, అలాగే చెన్నవరంలో సర్వేనంబర్ 223/1 లో 0.52 సెంట్లు, రాచాయపేటలో సర్వే నంబర్ 494లో 0.54 సెంట్లు, 550 సర్వేనంబరులో 1.46 ఎకరాలు, 559 సర్వేనంబరులో 1.10 ఎకరాలు, ఎస్.రామాపురం సర్వేనంబర్ 1595లో 0.41 సెంట్లు, టీ.సండ్రపల్లె సర్వేనంబర్ 927/2లో 0.23 సెంట్లు, రామాపురం సర్వేనంబర్ 1454/1లో 0.62 సెంట్లు సోమేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించి భూములు ఉన్నాయి. భూములు దక్కించుకున్న వారికి మూడు సంవత్సరాల కాల వ్యవధి ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు వేలంపాటలో పాల్గొనాలని కోరారు. ఈ సారైనా భూముల వేలంపాట సక్రమంగా నిర్వహించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మళ్లీ రావమ్మా.. మా తల్లీ గంగమ్మా

రైల్వేకోడూరు అర్బన్ : భక్తులపాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న కోడూరు గంగమ్మ జాతర శుక్రవారం నిర్వహించిన నిమజ్జనంతో ముగిసింది. పట్టణంలోని పాత బజారువీధిలో గంగమ్మ మిట్టలో వెలసివున్న గంగమ్మను గత రెండురోజులుగా వేలాది మంది ప్రజలు, భక్తులు దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి గంగమ్మ మిట్ట నుండి కొనసాగిన అమ్మవారి శోభాయాత్ర వేలాది మంది భక్తుల నడుమ వైభవంగా సాగింది. మహిళలు గంగమ్మకు హారతులు ఇచ్చారు. భక్తులు దారి వెంబడి మొక్కుబడులు తీర్చుకొన్నారు. ఈ ఏడాది మమ్మల్ని సుభిక్షంగా చూడాలని అమ్మవారిని భక్తులు వేడుకున్నారు. యువకులు పెద్ద ఎత్తున వసంతాలు చల్లుకొంటూ, భారీఎత్తున బాణసంచా కాలుస్తూ గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ప్రత్యేక డప్పు వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి మట్టి, పూల కోసం ప్రజలు ఎగబడ్డారు. జాతరలో సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



నిమజ్జనానికి వెళుతున్న గంగమ్మ

రక్తదానం చేసి ప్రాణాలను కాపాడండి



రక్తదానం చేస్తున్న దాతలు

రాయచోటి టౌన్ : ఆరోగ్యవంతులుగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని ట్రాఫిక్ సీఐ మహబూబ్ బాషా అన్నారు. శుక్రవారం రాయచోటికి చెందిన డాక్టర్ అబ్దుల్ కలాం ట్రస్టు చైర్మన్ వినయ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే డాక్టర్ బయారెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన మన అరోగ్యానికి కలిగే ప్రయోజనాలను వివరించారు. ఇతరుల ప్రాణాలను కాపాడటంతోపాటు మన రక్తం ఎప్పటికప్పుడు శుభ్రమవుతుందని తెలిపారు. ప్రతిభ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ శివగంగిరెడ్డి మాట్లాడుతూ యువత సమాజ సేవపై ఆసక్తి కలిగించాలని, విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని తెలిపారు. మహిళా డిగ్రీ కళాశాల డైరెక్టర్ మనోజ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ మహేశ్వర రాజు, బ్యాంక్ బరోడా బ్యాంక్ మేనేజర్ మహేష్, డాన్స్ మాస్టర్ రేష్మా,కిరణ్, రామాంజులు, నాగరాజు, శివ, సునీల్, కిరణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే గ్రామ బహిష్కరణ

సిద్దవటం (ఒంటిమిట్ట) : గొడవలకు పాల్పడితే గ్రామ బహిష్కరణ చేస్తామని సిద్దవటం ఎస్‌ఐ పెద్దఓబన్న తెలిపారు. మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం గ్రామ ప్రజలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న పోస్ట్ పోల్ (ఎలక్షన్ తరువాత) జరుగు సంఘటనలు దృష్టిలో పెట్టుకొని ఎవరైనా సరే, ఎంతటి వారైనా సరే గొడవలకు దిగితే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు రిజిస్టర్ చేసి వెంటనే రిమాండ్‌కు తరలించి జైలుకు పంపుతామన్నారు. అలాగే రౌడీ షీట్స్ ఓపెన్ చేసి గ్రామ బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. సోషల్ మీడియాల రాజకీయ పరంగా రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టిన వారిపై, గ్రూప్ అడ్మిన్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరూ గలాటాలు, గొడవలు పెట్టుకోవద్దని, ఏదైనా సమస్య ఉంటే పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.



ప్రజలకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ పెద్దఓబన్న

భక్తి శ్రద్ధలతో చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు



అమ్మవారికి 101 బిందెలతో అభిషేకం చేస్తున్న మహిళలు

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని కోనంపేట గ్రామంలో వెలసిన చౌడేశ్వరి దేవి అమ్మవారికి శుక్రవారం నుంచి సోమవారం వరకు జ్యోతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటిరోజు అమ్మవారికి 108 బిందెలతో అభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి జ్యోతులు వెలిగించి పూజలు నిర్వహించారు. నేడు శనివారం పుష్పాండ మహర్షి పీఠాధిపతులు దివ్యానంద గిరి స్వాములచే జ్యోతిర్లింగ అలంకరణ చేశామన్నారు. అలాగే ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించి పూజా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం మూడు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతోందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

సంప్రదాయ వైద్యంతో శాశ్వత పరిష్కారం

కడప కల్చరల్ : సంప్రదాయ వైద్యంతో ఆరోగ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశముందని జీవిత బీమా సంస్థ సీనియర్ డివిజనల్ మేనేజర్ రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయ ఆవరణలో ఎల్‌ఐసీ–శాంతిగిరి ఆయుర్వేద సిద్ధ ఆసుపత్రి సంయుక్తాధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రామన్ని ప్రారంభిస్తూ ఆయన ఆధునిక వైద్యం బాగా విస్తరించిన నేటి కాలంలో కూడా ప్రాచీన వైద్య విధానాలైన ఆయుర్వేద, సిద్ధ వైద్య విధానాలు నేటికీ అనుసరణీయమన్నారు. ఆయుర్వేదం వ్యాధిని నయం చేయడంపై దృష్టి పెడితే, సిద్ధ వైద్యం ఆరోగ్యాన్ని సమకూరుస్తుందని, శారీరక వ్యవస్థ మొత్తాన్ని పునరుజ్జీవం చేస్తుందని అన్నారు. మొండి వ్యాధుల్ని, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంలో ఈ వైద్య విధానాల ప్రాధాన్యత అందరూ గుర్తిస్తున్నారని తెలిపారు. శాంతిగిరి ఆయుర్వేద–సిద్ధ హాస్పిటల్ బాధ్యులు, వైద్య శిబిరంలో పాల్గొన్న ఆరోగ్య నిపుణులు డాక్టర్ ఆదర్శ్ అజయ్, డాక్టర్ వందన డీఎస్ మాట్లాడుతూ వెన్నునొప్పి, మోకాళ్ల నొప్పి, కీళ్లనొప్పి, చర్మసంబంధ సమస్యలు, జీర్ణకోశ సమస్యలు, నాడీ సంబంధిత సమస్యలకు శిబిరంలో కన్సల్టేషన్, వైద్య సేవలు అందించామన్నారు. కడప, దేవుని కడపలో ఉన్న తమ కేరళ ఆస్పత్రిలో ఇన్ పేషెంట్, వార్డ్ రూమ్‌ల సౌకర్యాలతో సంప్రదాయక పంచకర్మ వైద్యాన్ని కూడా అందిస్తున్నామని, రాష్ట్రం లోని పలు జిల్లాల నుంచి రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. శిబిరంలో 50 మందికి పైగా సేవలు అందుకున్నారు. శాంతిగిరి ఆసుపత్రి మేనేజర్ మోహనన్, సీనియర్ అసిస్టెంట్ పుష్పలత, సీనియర్ థెరపిస్టులు మను, మిథున్ సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎల్‌ఐసీ ఓఎస్ మేనేజర్ సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉచిత వైద్య శిబిరంలో మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్ సుందర్ రావు, సేల్స్ మేనేజర్ సాల్మన్ రాజు, ఆనందరావు, రఘునాథ్ రెడ్డి, అవధానం శ్రీనివాస్ పాల్గొన్నారు. శిబిరంలో వైద్య సేవలు అందించిన శాంతిగిరి ఆసుపత్రి నిపుణులందరినీ సీనియర్ డివిజనల్ మేనేజర్ రవికుమార్ సత్కరించారు.



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేత

పుల్లంపేట : ఎస్‌బీవీడీ సభా ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 500 మార్కులు సాధించిన ఐదు మంది విద్యార్థులకు వీఎస్ కన్‌స్ట్రక్షన్ అధినేత ప్రతాప్ రెడ్డి శుక్రవారం ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకం అందించారు. అలాగే వీరికి ఇంటర్మీడియట్ చదివేందుకు అయ్యే ఖర్చు తానే భరిస్తానని హామీనిచ్చారు. విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీరాములు, హెచ్‌ఎం మురళీమోహన్‌రెడ్డి, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.



పదిలో 500 మార్కులు సాధించిన విద్యార్థినులు



విద్యార్థులకు నగదును అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు